

మనం

కరీంనగర్

జగిత్యాల- రాజన్న సిరిసిల్ల-పెద్దపల్లి-అసిఫాబాద్-మంచిర్యాల

సోమవారం | 19 | అక్టోబర్ | 2026 | పేజీలు 10 | www.manamepaper.com

త్వరలోనే మంథనిలో గార్మెంట్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం చేస్తాం

మంత్రి శ్రీధర్ బాబు

మహిళా సోదరిమణులు పాడి పరిశ్రమల వైపు ముందుకెళ్లాలి

ఫ్యాక్టరీ ద్వారా 300మంది నుండి 400 మందికి ఉపాధి

ఎల్నినో కారణంగా వనరులను పొదుపుగా వాడండి

త్వరలోనే మంథనిలో గార్మెంట్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం చేస్తామని మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఆదివారం మంథని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అలీఫ్, డిఆర్డిఏ/మెప్మా/ సిఎస్ఆర్ ద్వారా మంథని మున్సిపల్ పరిధిలో కుట్టు మిషన్లు ఏర్పాటు చేసి 600 మందికి ఉచిత కుట్టు శిక్షణ పూర్తి చేసిన వారికి శ్రీధర్ బాబు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.

మంథని అక్టోబర్ 18 (మనం న్యూస్) : మంథని నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు 3040 మందికి కుట్టు మిషన్ ఉచిత కోచింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. శిక్షణ పొందిన లబ్ధిదారులకు సర్టిఫికెట్లు కూడా అందజేశామన్నారు. రూ.కోటి రూపాయలు విలువచేసే 302 మందికి సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రాష్ట్ర ఐటీ,పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి..

- మిగతా 2లో..



వివరాలు 2లో..

ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

ప్రకృతిని పూజిస్తూ.. తెలంగాణ సంస్కృతిని చాటుతూ ఆడపడుచుల ఆటపాటలు



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ముగింపు ఘట్టమైన సద్దుల బతుకమ్మ సంబరాలకు రాజన్న సిరిసిల్ల జిల్లా సిద్ధం చేశారు. ప్రకృతిలో విరబూసే రంగురంగుల పూలను అందంగా పేర్చి, గౌరమ్మను పూజిస్తూ ఆడపడుచులు జరుపుకునే ఈ పూల పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తోంది. పల్లెల నుంచి పట్టణాల వరకు బతుకమ్మ పాటలు, కోలాటాలు, సంప్రదాయ ఆటపాటలతో పండుగ వాతావరణం నెలకొంది.

సిరిసిల్ల అక్టోబర్ 18 (మనం ప్రతినిధి) : తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలతో బతుకమ్మను అందంగా పేర్చి, మధ్యలో గౌరమ్మను ప్రతిష్ఠించి మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. తొమ్మిది రోజుల పాటు సాగిన బతుకమ్మ వేడుకలు సద్దుల బతుకమ్మతో పరిపూర్ణతను సంతరించుకుంటాయి. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మల చుట్టూ వలయంగా తిరుగుతూ పాటలు పాడుతూ సంబరాలు చేసుకుంటారు.

సిరిసిల్లలో సంప్రదాయాలకు పెద్దపీట

చేనేతకు పేరుగాంచిన రాజన్న సిరిసిల్ల జిల్లాలో బతుకమ్మ పండుగకు ప్రత్యేకమైన సాంస్కృతిక ప్రాధాన్యత ఉంది. తెలంగాణ ఆడపడుచులు తమ కుటుంబాల సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు, పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని గౌరమ్మను ప్రార్థిస్తారు. కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు ఒకచోట చేరి పండుగను ఆనందంగా జరుపుకోవడం ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. సద్దుల బతుకమ్మ సందర్భంగా సంప్రదాయ నైవేద్యాలైన సద్దులు, పులిహోర తదితర వంటకాలను తయారు చేసి అమ్మవారికి సమర్పిస్తారు. అనంతరం బతుకమ్మలను సమీపంలోని చెరువులు, నీటి వనరుల..

కొండాపూర్‌లో బతుకమ్మ ఘాట్‌ను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

బతుకమ్మ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక

మంత్రి పొన్నం ప్రభాకర్

చిగురుమామిడి, అక్టోబర్ 18 (మనం న్యూస్) : చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన బతుకమ్మ ఘాట్ ను రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... బతుకమ్మ పండుగ అంటే కేవలం పూల పండుగ కాదు, ఇది మన తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక. తెలంగాణ ఆడబిడ్డల ఐక్యతకు, మన సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దం బతుకమ్మ అని అన్నారు. తొమ్మిది రోజుల పాటు తెలంగాణ ఆడబిడ్డలు ఎంతో భక్తిశ్రద్ధలతో బతుకమ్మను ఆడి పాడుతారు. ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ పండుగ" అని అన్నారు. ఎల్ నినో, వర్షాలు, ఆరుతడి వ్యవసాయం, వాతావరణం గురించి మాట్లాడుతూ...



వివరాలు 2లో..

కొండాపూర్‌లో బతుకమ్మ ఘాట్‌ను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

(మొదటి పేజీ తరువాయి)

ఎల్ నినో ప్రభావంతో ఈసారి వర్షాలు కొద్దిగా తగ్గే అవకాశం ఉంది. రైతులు వర్షాలపై ఆధారపడకుండా జాగ్రత్తగా ఉండాలి. నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడాలి. ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలి"లి అని సూచించారు. "రైతులు వరి పంటనే కాకుండా ఆరుతడి పంటలు వేయాలి. ఆరుతడి పంటలకు తక్కువ నీరు సరిపోతుంది, ఎక్కువ లాభం వస్తుంది. ఎల్ నినో ఉన్నా కూడా ఆరుతడి పంటల వల్ల నష్టం ఉండదు. ప్రభుత్వం ఆరుతడి పంటల రైతులకు అండగా ఉంటుంది" అని భరోసా ఇచ్చారు.

దీపావళికి ప్రతి గ్రామానికి హైమాక్స్ లైట్లు – మంత్రి హామీ

"దీపావళి పండుగ నాటికి మండలంలోని ప్రతి గ్రామానికి హైమాక్స్ లైట్లు మంజూరు చేస్తాం. గ్రామాల్లో రాత్రి వేళల్లో చీకటి ఉండకుండా, ప్రజల భద్రత కోసం, పండుగ వెలుగుల కోసం ప్రతి గ్రామానికి హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేస్తాం" అని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మార్క రాజ్ కుమార్ గౌడ్, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందె సురేష్, చిగురు మామిడిసింగిల్ విండో చైర్మన్ చిట్టి మల్ల రవీందర్, ఉప సర్పంచ్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

(మొదటి పేజీ తరువాయి)

వద్ద నిమజ్జనం చేసి పండుగకు ముగింపు పలుకుతారు.

మహిళల ఐక్యతకు.. తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక

బతుకమ్మ కేవలం ఒక పండుగ మాత్రమే కాదు. మహిళల ఐక్యతకు, ప్రకృతితో మానవ సంబంధానికి, తెలంగాణ సంస్కృతి వైభవానికి ప్రతీక. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయం నేటి యువతరానికి మన సంస్కృతిని పరిచయం చేస్తూ ముందుకు సాగుతోంది. ఆధునిక జీవనశైలిలోనూ బతుకమ్మ పండుగ తన ప్రత్యేకతను నిలబెట్టుకోవడం విశేషం.

చెరువుల పరిరక్షణకు ప్రాధాన్యత.

బతుకమ్మ వేడుకల సందర్భంగా పూలను, సహజ పదార్థాలను ఉపయోగిస్తూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్లాస్టిక్, ఇతర హానికర పదార్థాలను నీటి వనరుల్లో వేయకుండా ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలి. పండుగ ఉత్సాహంతో పాటు చెరువుల పరిశుభ్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత.

పూల సౌందర్యం.. పాటల పరవశం.. సంప్రదాయాల సందడి..

సద్దుల బతుకమ్మ వేడుకలు తెలంగాణ ఆడపడుచుల ఆనందానికి ప్రతిబింబం. పూలను పూజిస్తూ ప్రకృతికి కృతజ్ఞతలు తెలిపే ఈ పండుగ రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రజల మధ్య ప్రేమాభిమానాలను పెంపొందిస్తూ, తెలంగాణ సంస్కృతి వైభవాన్ని మరోసారి సిరిసిల్ల జిల్లాలో విశిష్టత గా నిలిచింది.

త్వరలోనే మంథనిలో గార్మెంట్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

దుద్దిల్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా చెక్కుల పంపిణీ చేశారు.ఈ సందర్భంగామంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూమంథని నియోజకవర్గ ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ,విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.అందరూ సుఖసంతోషాలతో,పాడిపంటలతో,చల్లగా ఉండాలని ఆ భగవంతుని కోరారు.ప్రత్యేకంగా మరి ఈ ప్రాంతంలో నేను గెలిచిన మొదటి సంవత్సరం నుంచి కుట్టు మిషన్లకు సంబంధించిన శిక్షణ ఇప్పియడం జరిగిందన్నారు. దాదాపు ప్రతి గ్రామంలో కొంతమందిని ఎంపిక చేసుకుని ఈరోజు క్యాంపు,ఎస్సీఆర్పి మరి నేను కూడా వారితోపాటు నా సొంత నిధులతో కుట్టుమిషన్ లకు సంబంధించిన మరికొన్ని సంస్థలతో మాట్లాడి కుట్టు మిషన్లను ఏర్పాటు చేసుకొని 394 మందికి ఉచిత కుట్టు శిక్షణ పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. చాలామంది కుట్టుమిషన్ లకు సంబంధించిన శిక్షణ తీసుకున్నారనీ,తీసుకున్న వారికి రాబోయే కాలంలో వారికి ఉపాధి ఇవ్వాలని ఒక చిన్న గార్మెంట్ ఫ్యాక్టరీని మూడు నుంచి నాలుగు వందల మందికి డిసెంబర్ నెల మాసంలో వారందరికీ కూడా ఉపాధి ఇచ్చే కార్యక్రమం మంథని సంబంధించిన కేంద్రంలో ఏర్పాటు చేస్తామన్నారు.నవంబర్ ఫస్ట్ నుంచి పనులు ఏర్పాటు చేస్తామని, ఫ్యాక్టరీని నెలకొల్పే వారితో మాట్లాడడం జరిగిందన్నారు ఫ్రీ ట్రైనింగ్ నవంబర్ ఫస్ట్ నుంచి ఎంపిక చేసి వారందరికీ ఫ్రీ ట్రైనింగ్ ఇచ్చే కార్యక్రమాన్ని చేపడతామనీ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మంథని,రామగిరి, ముత్తారం,కమాన్ పూర్,పాలకుర్తిలోని గ్రామాలకు సంబంధించి 84 వివో భవనాలు,84 మంజూరైనవని, రెండు సంవత్సరాలలో ఒక్కొక్క భవనానికి 10 లక్షల రూపాయల చొప్పున ఎనిమిది కోట్ల 40 లక్షల రూపాయలు భవన నిర్మాణలు,403అంగన్వాడి భవనాలు మంజూరు చేర్పించడం జరిగిందనీ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.ఒక్కొక్క అంగన్వాడీ కేంద్రానికి 12 లక్షల రూపాయలు చొప్పున మంజూరైనవని మంథని నియోజకవర్గంను ముందుకు తీసుక వెళ్తున్నామన్నారు. కమాన్ పూర్ మండలంలో 10, ముత్తారం మంథనిలో 18, రామగిరిలో18, పాలకుర్తిలో4, భవనాలను మంజూరు చేయించడం జరిగిందన్నారు.మంథని మండలంలో కూడా10 అంగన్వాడీ కేంద్రాలు,కమాన్ పూర్ లో6, ముత్తారంలో 6, రామగిరిలో 14, పాలకుర్తి7, బోనాలు మంజూరైనవని ఆయన తెలిపారు. పాడి పరిశ్రమకు సంబంధించి నేను మా సోదరీమణులకి పట్టణానికి సంబంధించి గాని అదేవిధంగా గ్రామాలకు సంబంధించి గాని ఎవరైతే పాడి పరిశ్రమకు ఇక్కడ పాడి పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ప్రతి లబ్ధిదారులు రెండు గేదెలను పెంచుకొని 10నుండి 30మందిని కలుపుకొని ఒక డేని యూనిట్ ను ఏర్పాటు చేసుకొని పాడి లబ్ధిదారులు ఏర్పడి చేసుకుని వారిని ముల్క నూరు డైరీకి 15 రోజుల ట్రైనింగ్ కు పంపడం జరుగుతుందన్నారు. ఓ ప్రయత్నం చేసే దిశలో మనం ముందుకు వెళ్తా ఉన్నాం...జనవరి మాసం నుంచి ఈ కార్యక్రమం కార్యచరణ తీసుకోవడం జరుగుతుందని, ప్రత్యేకించి మహిళాలకు సంబంధించి మరొక 20,30,40 మందిని కలుపుకుని గ్రూప్ లను తయారు చేసే కార్యక్రమం చేపట్టాలని ఆయన కోరారు.శ్రీపాద కోఆపరేటివ్ డైరీ యూనిట్ ను పెట్టినం, కాంగ్రెస్ ప్రభుత్వం పోయిన తర్వాత దాన్ని గత ప్రభుత్వం దాన్ని ముగించడం జరిగిందని.ఈరోజు కల్యాణ లక్ష్మితో పాటు అదేవిధంగా అలీపుకు సంబంధించి వారి చేతుల మీదుగా ట్రైనింగ్ పొందిన మహిళాలకు సర్టిఫికెట్ ఇచ్చే కార్యక్రమం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.త్వరలో డిసెంబర్ మాసంలో ఒక చిన్న ఫ్యాక్టరీని ప్రారంభోత్సవం చేస్తామన్నారు.దేశవ్యాప్తంగా ఎల్ నినో కారణంగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం ప్రపంచవ్యాప్తంగా కూడా చాలా దేశాలు సంబంధించిన ఎల్ నినో ప్రభావం ఉందని,దాంట్లో మన రాష్ట్రం కూడా ఒకటనీ,దానివల్ల నీటికి సంబంధించిన ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు నీటిని కొద్దిగా మిశ్రమంగా పొదుపుగా, వాడుకొని జాగ్రత్తలు పడాల్సిన అవసరం ఉందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు.గ్రామ సర్పంచులకి, చైర్మన్,కౌన్సిలర్లకి మా గ్రామానికి సంబంధించిన బాధ్యత తీసుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు.శ్రీపాద ఎల్లంపల్లి నుంచి గాని,ఎస్సారెస్పీ నుంచి గాని నీళ్లు ఇచ్చే కార్యక్రమం చేసి ఎక్కడ కూడా పంటకి ఇబ్బంది లేకుండా చేశామని,కరెంటు పొదుపుగా ఉ పయోగించుకునే ప్రయత్నం చేద్దామని,ఎవరు ఎన్ని రాజకీయాలు చేసిన ప్రభుత్వంగా మా అధికారులు కానీ,మేము గాని ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన అవసరం మా ఉందన్నారు. ఈరోజుకంటిన్యూజెన్సీ ప్లాన్ ఏర్పాటు చేసుకొని అధికారులను ముందుకు నడవాలని ముఖ్యమంత్రి చెప్పడం జరిగిందనీ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.ఈరోజు మనకు సంబంధించి కరెంట్ గాని, మంచినీటికి సంబంధించి గాని, ఉపాధి పరంగా గాని, జూన్ మాసం వరకు ప్రజలందరూ కొద్దిగా పొదుపుతో జాగ్రత్తతో ముందుకు నడిచే ప్రయత్నం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ అభివృద్ధివైపు పయనిస్తామన్నారు. దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా రాష్ట్ర పరంగా ఏదైతే ఎఫెక్ట్ వచ్చిందో ప్రకృతి పరంగా దాని అధిగమించే ప్రయత్నం మనం అందరం కలిసి చేద్దామని మంత్రి శ్రీధర్ బాబు కోరారు.

ఈ కార్యక్రమంలో చైర్మన్లు,కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,మండల కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు,మహిళా నాయకురాలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి, అక్టోబర్ 18, (మనం న్యూస్) : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం బెల్లంపల్లి పట్టణంలోని 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను, రోగుల పరిస్థితి, ఆసుపత్రికి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వ్యాధుల వివరాలు తెలుసుకుని వైద్యులకు పలు సూచనలు చేశారు. వార్డులను స్వయంగా పరిశీలించి, రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యం, సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పండుగల వేళలలో కూడా ఆసుపత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతిరోజు వైద్యులు తప్పనిసరిగా విధులలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అత్యవసర వైద్య సేవల కోసం ఎమర్జెన్సీ వార్డు నిరంతరం తెరిచి ఉంచాలని, కనీసం ఒక మెడికల్ డాక్టర్ విధిగా అందుబాటులో ఉండాలని తెలిపారు. ఆయన వెంట సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.



దుద్దిళ్ల బ్రదర్స్‌కు ప్రజల మనోభావాలకంటే మట్టి దోపిడీపైనే శ్రద్ధ

- మూడేళ్లయినా తమ్మచెరువు సుందరీకరణకు తట్టెడు మట్టి పోయలే

- నాలుగు నాలుగు సార్లు మంత్రి పదవి ఇచ్చానా నాలుగు పనులు చేయలే

- కమీషన్‌లు ఇస్తున్నరు కనుకనే రోడ్ల పనులకు అంత ప్రాముఖ్యత ఇస్తుండ్లు

- కమీషన్‌ల కోసం కోట్ల రూపాయల పనులను ధ్వంసం చేస్తుండ్లు

- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



మంథని అక్టోబర్18 (మనం న్యూస్) మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆయన సోదరుడికి మట్టి దోపకంపై ఉన్న శ్రద్ధ నియోజకవర్గ ప్రజల మనోభావాలు, ఆకలి మీద లేదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. ఆదివారం మంథని పట్టణంలోని తమ్మిచెరువును సందర్శించిన ఆయన మీడియాతో మాట్లాడారు.అనేక ఏండ్లుగా మన పూర్వీకుల కాలం నుంచి తమ్మి చెరువులో బతుకమ్మలను ఆంపే ఆనవాయితీ ఉండేదని తెలిపారు. ఈ చెరువును ఆనాడు తాము సుందరీకరణ చేశామని,అయితే పనులు ఎక్కడైతే ఆగిపోయాయోమూడేళ్లు అయినా పనులు అక్కడే ఉన్నాయని,సారుకు మంత్రి పదవి వచ్చినా తట్టెడు మట్టి పోయలేదని ఎద్దేవా చేశారు.తాము ఏనాడు ఓట్ల కోసం రాజకీయం కోసం మాట్లాడమని తమ మాటలకు తమ్మిచెరువు నిలువెత్తు సాక్ష్యమని చెప్పారు.ఆనాడు తమ్మి చెరువును అద్భుతంగా తీర్చిదిద్ది బోటింగ్,స్కాక్స్ పాయింట్, రింగ్‌రోడ్‌ను ప్రతిపాదన చేశామని, 70శాతం పనులు పూర్తి కాగా ప్రభుత్వం మారిపోవడంతో అక్కడే ఆగిపోయాయని , మూడేళ్లయినా ముందుకు సాగలేదని విమర్శించారు. ఈనాడు కమీషన్‌ల కోసం రోడ్లు చేస్తున్నారని,ఈ చెరువు పనులకు కమీషన్‌లు ముట్టకపోవడంతోనే పనులు చేస్తలేరని బావిస్తున్నట్లు చెప్పారు.ఒకవేళ కమీషన్‌లు ముట్టితే ఎన్నికలకు ముందు చేస్తారు కావచ్చని అన్నారు.మంథనిలో ఉన్న చెరువుల్లో కావాలనే మట్టి తీసి పెద్దగా ఉన్న చెరువులను చిన్నగా చేశారని,ఇందుకు రావుల చెరువు నిదర్శనమన్నారు. మంథనిలో గొప్పగా అభివృద్ధి జరుగుతాందని వచ్చి పోయేటోళ్లు అనుకునేలా రోడ్ల పనులు చేస్తున్నరే తప్ప చదువుకున్న యువకులు, మహిళల కోసం దుద్దళ్ల శ్రీధర్ బాబు ఆలోచన చేయడం లేదన్నారు. తమ్మిచెరువుకు ఒక ప్రత్యేక ఉందని, అనేక జీవరాశులు ఇక్కడే ఉంటాయని, సాయంకాలం అనేక మంది సేద తీరుతూ ప్రకృతిని తిలకిస్తుంటారని, అలాంటి వారికి నిరాశే మిగిలిందన్నారు. ఓట్లప్పుడే పనులు చేస్తమనుకోవడం మంచి పద్దతి కాదని హితవు పలికారు. 40ఏండ్లుగా అధికారం ఇస్తూ నాలుగు నాలుగు సార్లు మంత్రి పదవులు ఇప్పిస్తే నాలుగు పనులు చేయకపోవడం సిగ్గు చేటన్నారు.ఏదో పెద్దస్థాయిలో ఉన్నారని మంచిగా అభివృద్ధి చేస్తరనే మున్సిపాలిటిని పెద్ద మెజార్టీతో అప్పజెప్తే పాలకవర్గం కూడా ఏమీ చేయడంలేదని, నాయకత్వం లాగే పాలకవర్గ కూడా వ్యవహరిస్తోందని, వాళు మట్టి దోపిడి చేస్తుంటే పాలకవర్గం చెత్త దోపిడి చేస్తోందని ఆరోపించారు.ప్రజల పక్షాల ప్రతి సమస్యను దృష్టికి తీసుకువస్తామని, తమపై తన కుటుంబం గురించి మాట్లాడితే మేము మీ కుటుంబం మీద మాట్లాడుతామని, ఎస్సీ ఎస్టీ వాళ్లతో తిట్టిపిస్తూ భయభ్రాంతులకు గురి చేసినా ఆగమన్నారు. తమ్మిచెరువు వద్ద బతుకమ్మ ఘాట్‌లు ఏర్పాటు చేసి బోటింగ్ పెట్టాలని ఆలోచన చేశామని,కానీ మూడేళ్లుగా మీరేం చేశారో జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు.రోడ్ల పనులకు కమీషన్‌లు ఇస్తున్నరు కనుకనే ఆ పనులకే ప్రాముఖ్యత ఉందని, కమీషన్‌ల కోసం ఎన్ని ధ్వంసం చేస్తున్నరో ప్రజలు ఆలోచన చేయాలన్నారు. మంథని రామగుండం రోడ్డు విస్తరణ ఉందని తెలిసినా ఆనాడు లైట్లు ఏర్పాటు చేశారని,ఈనాడు మళ్లీ విస్తరణ పేరుతో ఆ లైట్లను తొలగించారని అన్నారు.

ఈ లైట్ల ఏర్పాటుకు కోట్ల రూపాయలు వెచ్చించారని, కమీషన్‌ల కోసం లైట్లు వేసిండ్లు కమీషన్‌లు ముట్టినంక లైట్లు తీసేసిండ్లని,మళ్లీ కొత్త లైట్ల కోసం కమీషన్‌లు తీసుకుంటారని ఆయన అన్నారు.మీ నాయకుడిని నమ్మి ప్రజలు అవకాశం ఇస్తే మూడేళ్లయినా తమ్మి చెరువు గురించి ఆలోచన చేయలేదని, అయ్యగారి చెరువుకు సుందరీకరణ ఎందుకో సమాధానం చెప్పాలన్నారు. మూడేళ్లుగా తమ్మిచెరువు చీకటిగా ఉండటం సమాజానికే అవమానమని ఆయన అన్నారు. ఇప్పటికైనా మంథని ఎమ్మెల్యే కళ్లు తెరిచి మంథని ప్రజల మనోభావాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రైతుల ఇబ్బందులపై సర్పంచ్ తక్షణ స్పందన


-పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు.. రాకపోకలకు ఇబ్బందులు తొలగింపు



బుగ్గారం, అక్టోబర్ 18 (మనం న్యూస్): జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రం నుంచి సంధ్యపల్లెకు వెళ్లే ప్రధాన రహదారిలోని 12వ వార్డులో మర్రిచెట్టు సమీపంలో పగిలిన పైప్‌లైన్‌కు గ్రామ సర్పంచ్ నక్క రాజవ్వ రాజయ్య మరమ్మతులు చేయించారు. పైప్‌లైన్ పగిలిపోవడంతో రైతులు, గ్రామ ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె వెంటనే స్పందించారు. సంబంధిత సిబ్బందితో పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు. దీంతో రైతులు, గ్రామ ప్రజలకు రాకపోకల్లో ఎదు-రవుతున్న ఇబ్బందులు తొలగిపోయాయి. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకున్న సర్పంచ్‌ను గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ జంగ లావణ్య – శ్రీనివాస్,12వ వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

యువత చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలి

బెల్లంపల్లి, అక్టోబర్ 18, (మనం న్యూస్) : యువత చెడు వ్యాసనాలకు దూరంగా ఉండి, క్రీడల్లో రాణించాలని టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి అన్నారు. ఆదివారం బెల్లంపల్లి మండలం భూదాఖుర్దు గ్రామపంచాయతీలో కేపీఎల్ సీజన్ 3 కాశిరెడ్డిపల్లి గ్రౌండ్ లో గ్రామ సర్పంచ్ ఎంబడి రాణి సురేష్ అధ్యక్షతన క్రికెట్ ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి హాజరై మొదటి బహుమతి టీమ్ కి 15000/- రూపాయల నగదు బహుమతిని అందజేశారు. రెండవ బహుమతి భూదాఖుర్ద్ క్రికెట్ ఫ్రెండ్స్ యూత్ టీమ్ 10,000/- నగదు బహుమతి అందజేశారు, రన్నర్, విన్నర్ జట్లకు జటాయు కాస్మెటిక్ సంస్థ బండి లక్ష్మణ్ బ్యూటీ కిట్స్ అందించి యువతకు ప్రోత్సాహన్ని అందించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరుతూ ఈలాంటి ఆటలు ఆడటం శరీరానికి మానసిక ఉల్లాసాన్ని కలింగించడంతో పాటు మానసిక ప్రశాంతత దొరుకుతుందని, మానసిక ఒత్తిడికి లోనవకుండా ఉంటారని అన్నారు. యువత, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని, యువత చదువు మరియు క్రీడల పట్ల ఆసక్తి చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి బత్తుల రవి, సీనియర్ నాయకులు ఎంబడి సురేష్, పురంశెట్టి రాజేశం, డోల్మాషీ సత్తయ్య, మరపక వంశీ, తదితర నాయకులు పాల్గొన్నారు.



శిథిలావస్థకు చేరుకున్న మిషన్ భగీరథ ట్యాంకు

పొంచి ఉన్న ప్రమాదం...

పట్టించుకోని అధికారులు....



మిషన్ భగీరథ అధికారుల

భీమిని అక్టోబర్ 15 మనం న్యూస్ : భీమిని మండల కేంద్రంలోని అభయాంజనేయ స్వామి దేవాలయం పక్కన నిర్మించిన మిషన్ భగీరథ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకోంది. ఎప్పుడో 30 సంవత్సరాల క్రితం నిర్మించిన నీటి ట్యాంకు పగుళ్లు తేలి బీటలు వారి ప్రమాదకరంగా ఉంది. గత ప్రభుత్వ పాలనలో మిషన్ భగీరథ పేరుతో ఇదే ట్యాంకు పూతలు పూసి ఈ ట్యాంకు ద్వారా గ్రామంలోకి నీటిని విడుస్తున్నారు. ట్యాంక్ మొత్తం పెచ్చులుడిపోయి బీటలు వారి ఎప్పుడుకూలుతుందో తెలియని పరిస్థితిలో ప్రమాదం పొంచి ఉంది. పైపులు మొత్తం లీకేజీ లతో నీటి ట్యాంకు చుట్టూ బురదగుంట లా మారింది. మిషన్ భగీరథ అధికారులు చోద్యం చూస్తున్నారు తప్ప ప్రమాదం జరిగి ప్రాణ నష్టం జరిగే వరకు పట్టించుకునేలా కనిపించడం లేదు. గతంలో దీనిపై మిషన్ భగీరథ అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించలేదు. దీని పక్కన నివాస గృహాలు ఉండడంతో ఇది ఎప్పుడు కూలుతుందో అనే భయంతో బిక్కుబిక్కుమంటూ జనాలు జీవనం సాగిస్తున్నారు. నిర్లక్ష్యం ఎవరి ప్రాణాలను బలిగొంటుందో? నీటి విడుదల కూడా సమయం సందర్భం లేకుండా అర్ధరాత్రి అపరాత్రి నీటిని విడుదల చేస్తున్నారు. అసలు దీన్ని పట్టించుకున్న నాథుడు కూడా లేడు స్థానికంగా ఈ మిషన్ భగీరథ నీటి విడుదల కోసం ఎవరు పనిచేస్తున్నారు అనేది కూడా ప్రజలకు తెలియని పరిస్థితి ఇక్కడ నెలకొంది. సంబంధిత మిషన్ భగీరథ అధికారులు ఈ నీటి ట్యాంక్ పై దృష్టి సారించి ప్రమాదం జరగకముందే రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉంది.

మాజీ ఎమ్మెల్యే సుమన్ బర్త్‌డే సందడి



జైపూర్, అక్టోబర్ 18 (మనం న్యూస్): జైపూర్ మండల కేంద్రంలో చెన్నూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బలమూరి అరవిందరావు ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అభిమానులు కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకొన్నారు. మాజీ జెడ్పీటీసీ మేడి సునీత, తిరుపతి, గంగపల్లి ఎంపీటీసీ నరేండ్ల స్వాతి, గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బస్టాండ్ సమీపంలో ఈ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పేదలకు పండ్లను పంపిణీ చేసి తమ ఉదారతను చాటుకున్నారు. తెలంగాణ ఉద్యమం నుంచి నియోజకవర్గ అభివృద్ధి వరకు బాల్క సుమన్ చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. భగవంతుడు ఆయనకు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలు ప్రసాదించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు ఇచ్చి దీవించాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గుండు తిరుపతి, నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి, దూట శేఖర్, జగన్ గౌడ్, శ్రీరాములు, రాజేందర్‌రెడ్డి, మద్దుల మనోహర్‌రెడ్డి, మల్ల గౌడ్, చిలకాని శ్రవణ్ పాల్గొన్నారు.

శ్రీ దుర్గాదేవి సేవా సమితికి స్టీల్ ప్లేట్ల వితరణ



రాయికల్, అక్టోబర్ 18 (మనం న్యూస్) : పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాయికల్ మండలం రామాజీపేటకు చెందిన చింతలూరి సోను కమలాకర్, ఆకుల వనిత సత్యం దంపతులు శ్రీ దుర్గాదేవి సేవా సమితికి (ఇప్పకాడ) 200 స్టీల్ ప్లేట్లను అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ ప్లాస్టిక్ ప్లేట్ల వినియోగం వల్ల ఆరోగ్యానికి, పర్యావరణానికి హాని కలిగే ప్రమాదం ఉందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడటంతోపాటు వన్యప్రాణుల పరిరక్షణకు కూడా తోడ్పడవచ్చని తెలిపారు. మార్పులో తమ వంతు బాధ్యతగా స్టీల్ ప్లేట్లను అందజేసినట్లు పేర్కొన్నారు. అనంతరం దాతలను శ్రీ దుర్గాదేవి సేవా సమితి కమిటీ సభ్యులు అమ్మవారి సన్నిధిలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమితి కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అరుణాచలంలో బెల్లంపల్లి మహిళల బతుకమ్మ సంబరాలు



బెల్లంపల్లి, అక్టోబర్ 18, (మనం న్యూస్) : బెల్లంపల్లికి చెందిన మహిళలు అరుణాచలం పుణ్యక్షేత్రంలో బతుకమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి అరుణాచలేశ్వరుని దర్శించుకున్న అనంతరం, రాజగోపురం ముందు మహిళలందరూ ఒక్కచోట చేరి తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణలో ఎంతో వైభవంగా జరుపుకునే బతుకమ్మ పండుగను ఈసారి స్వరాష్ట్రంలో జరుపుకోలేకపోయినా, బెల్లంపల్లికి చెందిన మహిళలు అరుణాచలం పుణ్యభూమిలోనే బతుకమ్మను ఆడుతూ తమ సంప్రదాయాలపై ఉన్న మమకారాన్ని చాటిచెప్పారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ, ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలంగాణకు దూరంగా ఉన్నా తెలంగాణ సంస్కృతికి దూరం కాలేదు అన్నట్లుగా బెల్లంపల్లి మహిళలు నిర్వహించిన ఈ వేడుక అందరినీ ఆకట్టుకుంది. బతుకమ్మ అనేది కేవలం పండుగ మాత్రమే కాదని, అది తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, మహిళల ఐక్యతకు, ప్రకృతిని ఆరాధించే మన సంప్రదాయానికి ప్రతీక అని ఈ సందర్భంగా చాటిచెప్పారు. అరుణాచలేశ్వరుని దర్శనం, గిరి ప్రదక్షిణ వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు తమ ప్రాంతీయ సంస్కృతిని కూడా గౌరవిస్తూ పండుగ జరుపుకోవడం విశేషం. పుట్టిన ఊరికి, సొంత ప్రాంతానికి దూరంగా ఉన్నప్పటికీ తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను మరిచిపోకుండా ఆచరించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. బెల్లంపల్లి మహిళల బతుకమ్మ వేడుకలు తెలంగాణ సంస్కృతి సరిహద్దులు దాటి ఎక్కడైనా వెలుగొందగలదనే సందేశాన్ని అందించాయి. అరుణాచలం పుణ్యక్షేత్రంలో తెలంగాణ బతుకమ్మ సంబరాలు నిర్వహించడం ద్వారా తమ ప్రాంతంపై ఉన్న ప్రేమను, సంప్రదాయాలపై ఉన్న భక్తిని మహిళలు చాటిచెప్పారు.

యాష్నా ఫౌండేషన్ రాష్ట్ర కమిటీ నియామకం



కరీంనగర్ రూరల్ అక్టోబర్ 18(మనం న్యూస్)..సమాజ సేవ,రక్తదానం, ఆకలి రహిత సమాజ నిర్మాణం మరియు జంతు సంక్షేమమే లక్ష్యంగా కొలువుదీరిన 'యాష్నా ఫౌండేషన్' రాష్ట్ర నూతన కమిటీని ఆదివారం అధికారికంగా కరీంనగర్ లో ప్రకటించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మరియు రాష్ట్ర అధ్యక్షుడు పంజాల సాయి యశ్వంత్ గౌడ్ ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యుల వివరాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేసేందుకు మరియు యువతను సామాజిక దృక్పథంలో భాగస్వాములను చేసేందుకు ఈ నూతన కమిటీని నియమించినట్లు అధ్యక్షుడు పంజాల సాయి యశ్వంత్ గౌడ్ తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన ప్రతి ఒక్కరూ నిరుపేదలకు, అవసరంలో ఉన్నవారికి అండగా నిలుస్తూ ఫౌండేషన్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

యాష్నా ఫౌండేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు:రాష్ట్ర అధ్యక్షుడు: పంజాల సాయి యశ్వంత్ గౌడ్,

రాష్ట్ర ఉపాధ్యక్షుడు: మద్ది అనిల్ కుమార్,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్: టేకుమల్ల వంశీకృష్ణ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి: పంజాల సంపత్ కుమార్,రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి:ఎ. అశోక్ కుమార్,

రాష్ట్ర కార్యదర్శి: తంగళ్లపల్లి అభిషేక్,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి:తాళ్లపెల్లి ప్రేమ్ చంద్,

రాష్ట్ర సంస్థాగత కార్యదర్శి:మద్ది అరుణ్ కుమార్,రాష్ట్ర పి.ఆర్.ఓ (ర్=నా): న్యాలం అరుణ్ గౌడ్,

రాష్ట్ర మీడియా ం సోషల్ మీడియా కోఆర్డినేటర్: సాయిల్ల మహేష్,

రాష్ట్ర అధికార ప్రతినిధి: సిరికొండ అంజన్ రావు,రాష్ట్ర యూత్ కోఆర్డినేటర్:సాయిల్ లఅజిత్ కుమార్,రాష్ట్ర హరితహారం/గ్రీనరీ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్:సాయిల్ల అరుణ్ కుమార్,రాష్ట్ర జంతువుల దత్తత ం పునరావాస కోఆర్డినేటర్: మచ్చమల్ల మధుబాబు,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు:బుర్ర రేవంత్ గౌడ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు,ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కమిటీ నిర్వాహకులకు, బాధ్యులకు యాష్నా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పంజాల సాయి యశ్వంత్ గౌడ్ హృదయపూర్వక శుభాకాంక్షలు మరియు అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని రక్తదాన శిబిరాలు, ఉచిత ఆహార పంపిణీ మరియు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేపడతామని నూతన కమిటీ సభ్యులు ప్రతిజ్ఞ చేశారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు







దండేపల్లి అక్టోబర్ 17: (మనం న్యూస్) : దండేపల్లి మండలంలో బతుకమ్మ ఉత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వించారు. ఈ సంధర్భంగా మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మహిళలు, యువతులు తీరొక్క పువ్వుతో పెరించిన బతుకమ్మలను ఒక్క చోట చేర్చి బతుకమ్మ పాటలు పడుతూ ఆనందంగా గడిపారు. కాంగ్రెస్ పార్టీ, బిజెపి నాయకులు సైతం బతుకమ్మ పండుగ సంబరాలలో పాలుపంచుకున్నారు. బతుకమ్మ ఆట పాటలతో మండలంలోని అన్నీ గ్రామాల్లో ఎక్కడ చూసిన బతుకమ్మ పండుగ వేడుకలతో సందడి నెలకొంది.

తీరక పూలతో బతుకమ్మ వేడుక ముగింపు...

చిగురుమామిడి అక్టోబర్ 18 (మనం న్యూస్): తెలంగాణ ఆడబిడ్డల తొమ్మిది రోజుల పూల పండుగ బతుకమ్మ వేడుకలు ఆదివారం తీరక పూలతో ఘనంగా ముగిశాయి. చిగురుమామిడి మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం నాడు బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. తొమ్మిది రోజులుగా తంగేడు, గునుగు, బంతి పూలతో బతుకమ్మను పేర్చిన ఆడబిడ్డలు, ఆదివారం చివరి రోజు తీరక పూలతో బతుకమ్మను మరింత అందంగా తీర్చిదిద్దారు. సాయంత్రం కాగానే మండలంలోని బతుకమ్మ ఘాట్ లు ఆడబిడ్డలతో నిండిపోయాయి. సీసీ రోడ్లు, హైమాస్ లైట్ల వెలుగుల్లో ఘాట్ లు మెరిసిపోవడంతో సంబరాలు రెట్టింపయ్యాయి. మధ్యలో బతుకమ్మ, చుట్టూ వలయంగా ఆడబిడ్డలు "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..." అంటూ ఆడిపాడారు.

చాలా రోజులకు కలిసిన అక్కా చెల్లెళ్లు...

ఈ బతుకమ్మ ఘాట్ కేవలం ఆటపాటలకే కాదు, అక్కా చెల్లెళ్లు, అమ్మలు కలుసుకునే వేదిక కూడా.

"ఏందే చెల్లె, చాలా రోజులకు కలిసినవ్, ఎట్లున్నవ్? పిల్లలు బాగున్నరా?" అంటూ ఒక అక్క పలకరిస్తే...

"బాగున్నా అక్కా మీరంత బాగున్నరా? పండుగకు అందరం ఇట్లా కలవడం ఎంత బాగుందో" అంటూ చెల్లెలు బదులిచ్చింది.

"అవునే, ఈ బతుకమ్మ పండుగ వల్లనే మనందరం ఇలా కలుస్తున్నం. ఏడాదికోసారి అందరం కలిసి ఆడి పాడితే మనసుకు ఎంతో హాయిగా ఉంటుంది" అంటూ మరో అమ్మ మురిసిపోయింది.

ఇలా పూలతోనే కాదు, మాటలతో, పలకరింపులతో కూడా బతుకమ్మ ఘాట్ ఆప్యాయతలకు వేదికైంది. తరతరాలుగా తమ అవ్వలు ఆడిన అదే జాగల, ఇప్పుడు ఈ తరం ఆడబిడ్డలు అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తుండటం చూసి పెద్దలు ఆనందం వ్యక్తం చేశారు.

చిగురుమామిడి మండలంలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

బిచిగురుమామిడి: అక్టోబర్ 18 (మనం న్యూస్) : తెలంగాణ ఆడపడుచుల సంబరం సద్దుల బతుకమ్మ వేడుకలు చిగురుమామిడి మండల కేంద్రంతో పాటు , సుందరగిరి, కొండాపూర్, నవాబుపేట్, బొమ్మన పెల్లి, ఇందుర్తి, గాగిరెడ్డిపల్లి, ముల్కనూర్, పీచుపల్లి రేకొండ,, బొమ్మనపల్లి ఉల్లంపల్లి,వివిధ గ్రామాలలో అత్యంత ఘనంగా జరిగాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో ఆడపడుచులు తొమ్మిది రోజుల పాటు తొమ్మిది రకాల పూలతో బతుకమ్మను ఆరాధించి, చివరి రోజు సద్దుల బతుకమ్మను సంబరంగా జరుపుకున్నారు. ప్రధానంగా మండలంలోని గ్రామ అధికారులు ఊర చెరువు వద్ద బతుకమ్మ నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రాత్రి వేళ నిమజ్జనం కావడంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చెరువు కట్టపై హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేయడంతో వేడుకలు పట్టపగలులా కనిపించాయి.

మన సంస్కృతికి చిహ్నం బతుకమ్మ : సర్పంచ్ జంగా శిరీష రమణారెడ్డి

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జంగా శిరీష రమణారెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ అనేది మన తెలంగాణ సంస్కృతికి, సంప్రదాయాలకు, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. ప్రకృతిలో లభించే తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ప్రకృతిని ఆరాధించడం మన సంస్కృతి గొప్పతనమని తెలిపారు. మండలంలోని ఆడపడుచులంతా తొమ్మిది రోజుల పాటు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఐక్యంగా ఈ వేడుకల్లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు. సుందరగిరి ఊర చెరువు వద్ద నిమజ్జనానికి వచ్చిన మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ పంచాయతీ తరఫున హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేసి అన్ని వసతులు కల్పించామని చెప్పారు. ఈ పండుగల ద్వారా గ్రామాల్లో అనుబంధాలు, ఆప్యాయతలు మరింత బలపడతాయని సర్పంచ్ పేర్కొన్నారు.

శంకరపట్నం అక్టోబర్ 18 (మనం న్యూస్) : శంకరపట్నం మండలం పల్లెల్లో అంబరన్నంటిన బతుకమ్మ సంబరాలు

వెళ్లిరా గౌరమ్మా.. మళ్ళీ రావమ్మా..!

గంగాధర, అక్టోబర్ 18, (మనం న్యూస్): గంగాధర మండల వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ఊరు.. ఊరు, వాడ.. వాడలన్నీ పూలవనాలుగా మారాయి. మహిళలు, యువతులు, చిన్నారుల ఉయ్యాల పాటలతో గ్రామాలలో సందడి నెలకొన్నది. ఈ నెల 10న పెత్ర అమాస ఎంగిలిపూలతో మొదలైన బతుకమ్మ సంబురాలు.. సద్దుల బతుకమ్మతో ముగిశాయి. పూలనే పూజించే పండుగలో ఆడపడుచులు.. చిన్నా పెద్ద తేడా లేకుండా పాల్గొన్నారు. గునుగు, తంగేడు, తీరొక్క పువ్వులతో పేర్చిన బతుకమ్మలను సాయంత్రం గ్రామ ప్రధాన కూడళ్లలోకి తీసుకొచ్చి ఉయ్యాల పాటలు పాడారు. పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చి చిత్తూ చిత్తూల బొమ్మా.. శివుని ముద్దుల బొమ్మా.., ఒక్కేసి పువ్వేసి చందమామా.. ఒక్క జాములయే చందమామా.. జానపద పాటలు పాడుతూ, బతుకమ్మల చుట్టూ లయబద్ధంగా తిరుగుతూ, చప్పట్లు కొడుతూ ఆటలాడుతూ హోరెత్తించారు. అనంతరం బతుకమ్మలను చెరువులలో, బతుకమ్మ ఘాట్లలో నిమజ్జనం చేసి వెళ్లిరా గౌరమ్మా.. మళ్లీ రావమ్మా అంటూ గౌరమ్మను సాగనంపారు. ఆ తర్వాత మహిళలు పసుపు, బొట్టు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు.ఈ సందర్భంగా స్థానిక ఎస్సై బి. వంశీకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు



ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామ గ్రామాన బారి బందోబస్తు నిర్వహించారు.







వెళ్లిరా గౌరమ్మా.. మళ్ళీ రావమ్మా..!



రాయికల్, అక్టోబర్ 18 (మనం న్యూస్) : రాయికల్ మండలం ధావన్‌పల్లి గ్రామంలో ఆదివారం సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు, యువతులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామస్థులు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాలవత్ ప్రసాద్, ఉప సర్పంచ్, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

వేమనపల్లి, అక్టోబర్ 18, (మనం న్యూస్) : వేమనపల్లి మండలంలో సద్దుల బతుకమ్మ సంబరాలు మండలంలోని బుయ్యారం, నిల్వాయి, జిల్లెడ, దస్నాపూర్ తదితర గ్రామాల్లో సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో బతుకమ్మ కూడళ్ల వద్ద ఎలాంటి ఇబ్బందు తలెత్తకుండా సర్పంచులు ప్రత్యేకంగా లైట్లు ఏర్పాటు చేయడం జరిగింది. గ్రామాల్లో మహిళలంతా బతుకమ్మ పాటలతో ఆడి పాడి బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

మంచిర్యాలలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

మంచిర్యాల, అక్టోబర్ 18 (మనం న్యూస్) : మంచిర్యాల పట్టణంలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం పట్టణంలోని వీధులన్నీ బతుకమ్మ సంబరాలతో విరజిల్లాయి. చిన్న పెద్ద తేడా లేకుండా సద్దుల బతుకమ్మ సంబరాల్లో పాల్గొని సంతోషంగా బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను అలంకరించి దాదాపు మధ్యరాత్రి వరకు బతుకమ్మ పాటలు పాడుతూ ఆడుతూ , నృత్యాలు చేస్తూ, కోలాటాలాడుతూ సంబరాలు జరుపుకొని అనంతరం గౌరమ్మకు వీడ్కోలు పలుకుతూ అందుబాటులో ఉన్న నీటి ప్రదేశాలలో నిమజ్జనం చేశారు. బతుకమ్మ ఆడే ప్రదేశాలలో, నిమజ్జన ప్రాంతాలలో కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది వీధిలైట్ల ఏర్పాటుచేసి, పరిసరాలను పరిశుభ్రపరిచి అందంగా తీర్చిదిద్దారు.

భీమారంలో ఘనంగా సద్దుల బతుకమ్మ

భీమారం అక్టోబర్ 18, (మనం న్యూస్)మండలంలోని, 11గ్రామ పంచాయతీలలో,సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాంటాయి. తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పిన బతుకమ్మ పండుగ సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బతుకమ్మ అంటేనే పూలను పూజించే గొప్ప తెలంగాణ పండగ కావడంతో మహిళలంతా తొమ్మిది రోజులపాటు ఆడి పాడి వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకోవడం జరుగుతుంది. తొమ్మిది రోజులపాటు జరిగే ఈ బతుకమ్మ పండుగను ఎంగిలిపూల బతుకమ్మ, అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతకమ్మ,నానే బియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ,







అలిగిన బతుకమ్మ, వేపకాయల బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మ, తొమ్మిదో రోజున ఆదివారం రోజున సద్దుల బతుకమ్మ ఈ సందర్భంగా వాడ వాడలో, మహిళలు, చిన్నారులు ఆడి పాడారు.భీమారం మండల కేంద్రంతో పాటు పొలంపెల్లి, ఆరెపల్లి, మద్దికల్, కొత్తపల్లి, ఏలికేశ్వరం, బూరుగుపెల్లి, నర్సింగాపూర్, ఖాజీపల్లి, దాంపూర్, ధర్మారం గ్రామాలలో,బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి. మహిళలు ప్రధాన కూడళ్ల వద్ద బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాల అంటూ బతుకమ్మ పాటలతో, డీజే పాటలతో,ఆడి పాడారు. ఎక్కడ చూసినా బతుకమ్మ ఆటలు,పాటలు మహిళలంతా సంతోషంగా బతుకమ్మ వేడుకలను జరుపుకొని, మహిళలు తీసుకువచ్చిన ఫలహారాలను అమ్మవారికి నైవేద్యం చూపించి, ఒకరికొకరు పంచుకోవడం జరిగింది.మండలంలో,ఎక్కడ చూసినా బతుకమ్మ సంబరాలు ఎంతో వైభవంగా జరిగాయి.

బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 34వ వార్డులో సద్దుల బతుకమ్మ సంబరాలు

బెల్లంపల్లి, అక్టోబర్ 18, (మనం న్యూస్) : బెల్లంపల్లి మున్సిపాలిటీ లోని 34వ వార్డులో స్థానిక వార్డు కౌన్సిలర్ కొక్కుల రామ్మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళలు, కాలనీవాసులు రంగురంగుల తీరొక్క పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మలను మహిళలు కాలనీలోని ప్రధాన కూడలికి తీసుకువచ్చి, వాటి చుట్టూ తిరుగుతూ లయబద్ధంగా చప్పట్లు కొడుతూ బతుకమ్మ పాటలు పాడారు. గౌరమ్మను భక్తిశ్రద్ధలతో పూజించి, ఒకరికొకరు వాయనాలు ఇచ్చిపుచ్చుకున్నారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ కొక్కుల రామ్మూర్తి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగని కొనియాడారు. వార్డు ప్రజలంతా ఐకమత్యంగా, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం బతుకమ్మలను పోచమ్మ చెరువు లో నిమజ్జనం చేసి, మహిళలు తెచ్చిన సద్దులను ప్రసాదంగా పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రముఖులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దుర్గామాత మండపం వద్ద బతుకమ్మ సంబరాలు

లక్షెట్టిపేట అక్టోబర్ 18 (మనం న్యూస్) : లక్షెట్టిపేట పట్టణంలోని గోదావరి రోడ్డు వద్ద సాయి గణేష్ భక్తమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద మహిళలు బతుకమ్మ సంబరాలను





ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయబద్ధంగా రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ చేరి బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ, దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు.

గంగారంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

కాల్వ శ్రీరాంపూర్, అక్టోబర్ 17 (మనం న్యూస్) : కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని గంగారం గ్రామంలో శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణంలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, భక్తిశ్రద్ధలతో ఆటపాటలు ఆడారు. బతుకమ్మ పాటలతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ కుటుంబాలు సుఖసంతోషాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని మహిళలు కోరుకున్నారు. ఈ వేడుకల్లో గ్రామ మహిళలు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







సద్దుల బతుకమ్మ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి



జమ్మికుంట, అక్టోబర్ 18 (మనం న్యూస్): జమ్మికుంట పట్టణంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తన సతీమణి శ్రీమతి పాడి శాలిని రెడ్డి, కుమార్తె పాడి శ్రీనికా రెడ్డి తో కలిసి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఆడబిడ్డలందరికీ, అక్కాచెల్లెళ్లందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా సంతోషాలు నింపాలని, మహిళలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్, వైస్ చైర్మన్ జావిద్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజేత ముకుంద అపార్ట్మెంట్‌లో సద్దుల బతుకమ్మ వేడుకలు

కరీంనగర్ అక్టోబర్ 18 (మనం న్యూస్) : కరీంనగర్ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు కరీంనగర్ పట్టణంలోని విజేత ముకుంద అపార్ట్మెంట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అపార్ట్మెంట్‌కు చెందిన మహిళలు, ఆడపడుచులు రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలతో అలంకరించిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ ఆటపాటలతో సందడి చేశారు. చిన్నారులు సైతం వేడుకల్లో పాల్గొని ఆనందోత్సాహాలతో గడిపారు. తెలంగాణ సంస్కృతి వైభవాన్ని ప్రతిబింబించే బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, కుటుంబాల మధ్య అనుబంధాలకు ప్రతీకగా నిలుస్తుందని ఈ వేడుక చాటిచెప్పింది. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేస్తూ, పండుగలను సమష్టిగా నిర్వహించడం ఆనందదాయకమని వేడుకలో పాల్గొన్న మహిళలు పేర్కొన్నారు. పూల సౌందర్యం, బతుకమ్మ పాటలు, మహిళల సందడితో విజేత ముకుంద అపార్ట్మెంట్ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. తెలంగాణ సంప్రదాయాలను కాపాడుతూ, ఐకమత్యంతో పండుగలను జరుపుకోవాలనే సందేశాన్ని ఈ సద్దుల బతుకమ్మ వేడుకలు చాటిచెప్పాయి.



బతుకమ్మ ఘాట్లను సందర్శించి సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ విజయరమణ రావు





పెద్దపల్లి అక్టోబర్ 18 మనం న్యూస్. పట్టణంలోని ఎల్లమ్మ గుండమ్మ చెరువు కట్ట వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో మరియు శాంతినగర్లో ఘనంగా నిర్వహిస్తున్న సద్దుల బతుకమ్మ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని తెలంగాణ ఆడపడుచులకు పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపిన గౌరవ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, కమిషనర్, పట్టణ కౌన్సిలర్లు, సింగిల్ విండో చైర్మన్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రాంపల్లి డబల్ బెడ్ రూమ్ బతుకమ్మ వేడుకలు.

రాంపల్లి డబుల్ బెడ్ రూమ్ లో మహిళలు చిన్నారులు యువతీ యువకులు సద్దుల బతుకమ్మ ఘనంగా జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో రాంపల్లి డబుల్ బెడ్ రూమ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు

బెల్లంపల్లిలో ఘనంగా సద్దుల బతుకమ్మ





బెల్లంపల్లి,అక్టోబర్ 18, (మనం న్యూస్) : తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పిన బతుకమ్మ పండుగ సంబరాలు బెల్లంపల్లి పట్టణంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. బతుకమ్మ అంటేనే పూలను పూజించే గొప్ప తెలంగాణ పండగ కావడంతో మహిళలంతా తొమ్మిది రోజులపాటు ఆడి పాడి పుస్తకము వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకోవడం జరుగుతుంది. తొమ్మిది రోజులపాటు జరిగే ఈ బతుకమ్మ పండుగను ఎంగిలిపూల బతుకమ్మ, అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతకమ్మ, నానే బియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయల బతుకమ్మ, వెన్నముద్దల బతుకమ్మ, తొమ్మిదో రోజున ఆదివారం రోజున సద్దుల బతుకమ్మ సందర్భంగా వాడవాడనా మహిళలు ఆడి పాడారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని పట్టణంలోని 34 వార్డులలో, మండలంలో, తాండూర్, కాసిపేట, భీమిని,కన్నెపల్లి, వేమనపల్లి, నేన్నెల మండలాల్లో బతుకమ్మ సంబరాలు సంబరాలు అంబరాన్ని అంటాయి. మహిళలు కూడళ్ల వద్ద బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాల అంటూ బతుకమ్మ పాటలతో ఆడి పాడారు. ఎక్కడ చూసినా బతుకమ్మ ఆటలు, డీజే పాటల తో మహిళలంతా సంతోషంగా బతుకమ్మ వేడుకలను జరుపుకొని, మహిళలు తీసుకువచ్చిన ఫలహారాలను అమ్మవారికి నైవేద్యం చూపించి, ఒకరికొకరు పంచుకోవడం జరిగింది. బెల్లంపల్లి నియోజకవర్గంలో ఎక్కడ చూసినా బతుకమ్మ సంబరాలు ఎంతో వైభవంగా జరిగాయి.



బతుకమ్మను ఎత్తుకున్న ప్రభుత్వ విప్ విజయరమణ రావు



పెద్దపల్లి అక్టోబర్ 18 మనం న్యూస్ : తెలంగాణ రాష్ట్రంలో ఆడపడుచుఆలందరూ అట్టహాసంగా జరుపుకునే సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా ఆదివారం రోజున ఎలిగేడు మండలంలోని తమ స్వగ్రామమైన శివపల్లిలోని వారి నివాసంలో వారి సతీమణి పావని గారు, కుమార్తె వైష్ణవి మరియు తనయుడు గోపికృష్ణ రావు గార్లతో కలిసి బతుకమ్మను ఎత్తుకొని వేడుకలను ప్రారంభించి పెద్దపల్లి జిల్లా ఆడబిడ్డలందరికి సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన గౌరవ ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ. చింతకుంట విజయరమణ రావు.

కాల్వ శ్రీరాంపూర్ మండలంలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



కాల్వ శ్రీరాంపూర్, అక్టోబర్ 18 (మనం న్యూస్) : కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఆడపడుచుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను మహిళలు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సందడి చేశారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ ఆటలు ఆడి, తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. అనంతరం సమీపంలోని చెరువులు, కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. వేడుకలకు గ్రామ పంచాయతీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు తగిన ఏర్పాట్లు చేశారు.

సిరిసిల్లలో బతుకమ్మ సంబురాలు

-హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్.

సిరిసిల్ల, అక్టోబర్ 18 (మనం ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సద్దుల బతుకమ్మ సంబురాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. సిరిసిల్ల మున్సిపల్ ఆధ్వర్యంలో మానేరు వాగు వద్ద వేడుకలు నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రాకర్స్ షో అలరించాయి.



పట్టణ మున్నూరు కాపు సంఘం కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



బుగ్గారం, అక్టోబర్18 (మనం న్యూస్): బుగ్గారం పట్టణ మున్నూరు కాపు కుల పెద్దల ఆధ్వర్యంలో బుగ్గారం పట్టణ మున్నూరు కాపు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్నూరు కాపు సంఘం అభివృద్ధి, సభ్యుల ఐక్యత, సామాజికంగా, ఆర్థికంగా ఎదుగుదల సాధించడమే లక్ష్యంగా నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు, సభ్యులు సమావేశమై కమిటీ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించే నాయకులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ ఎన్నికల్లో బుగ్గారం పట్టణ మున్నూరు కాపు కమిటీ అధ్యక్షుడిగా భారతపు గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా మొగిలి సుధన్, ఉపాధ్యక్షులుగా కొల్లూరి మహేందర్, ఆకుల శేఖర్, కార్యదర్శిగా కప్పల లక్ష్మణ్, కోశాధికారిగా చీపిరిశెట్టి సంతోష్‌లను ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా మండల అధ్యక్షులు జక్కుల లింగారెడ్డి మాట్లాడుతూ, మున్నూరు కాపు సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సంఘం అభివృద్ధికి కుల సభ్యులందరి సహకారం ఎంతో అవసరమని, నూతన కమిటీ సభ్యులు తమకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ సంఘం అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. సమాజంలో మున్నూరు కాపుల ఐక్యతను చాటడంతో పాటు, పేద కుటుంబాలకు అండగా నిలవడం, యువతకు ప్రోత్సాహం అందించడం, విద్యా, సామాజిక రంగాల్లో అభివృద్ధికి కృషి చేయడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.

నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సంఘం పెద్దలకు, నాయకులకు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ కలుపుకొని సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని, మున్నూరు కాపుల ఐక్యతను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. సంఘం సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ముందుంటామని తెలిపారు. బుగ్గారం పట్టణ మున్నూరు కాపు కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరగడం పట్ల సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో సంఘం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు కుల పెద్దలు దాసర్థి రవి, దాసర్తి తిరుపతి, కేతి పోషమల్లు, జాబు లచ్చన్న, కేతి చిలుకన్న, భారతపు మల్లయ్య, దిండిగల సత్యనారాయణ, నూర నరేష్, భూక ప్రవీణ్ కుమార్, మాదాస్ రాజేందర్, భారతపు రాజశేఖర్, జక్కుల అమరేందర్, మొగిలి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

సుందరగిరిలో ఘనంగా బతుకమ్మ తల్లి విగ్రహావిష్కరణ



చిగురుమామిడి అక్టోబర్ 18(మనం న్యూస్):తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ వేళ కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామం ఒక అద్భుతమైన ఘట్టానికి వేదికైంది.గ్రామ ప్రజలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాలు విజయవంతంగా పూ-ర్తయ్యాయి.సుందరగిరి గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో దాతల ఉదార సహాయ సహకారాలతో ఊర చెరువు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన బతుకమ్మ తల్లి విగ్రహాన్ని గ్రామ సర్పంచ్ జంగ శిరీష వెంకటరమణారెడ్డి,హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డిలు హాజరై వైభవంగా ఆవిష్కరించారు. మహిళలు బతుకమ్మ ఆడే చెరువు వద్ద వెలుగులతో నింపేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను కూడా ఇదే శు భసందర్భంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,సర్పంచ్ జంగ శిరీష వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ మన గ్రామ సంస్కృతిని కాపాడుకుంటూ,అందరి సహకారంతో ఈ విశేష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉ ందన్నారు.ఈ కార్యక్రమానికి అన్ని రకాలుగా సహకరించి,పెద్ద ఎత్తున తరలివచ్చి,విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.బతుకమ్మ పండుగ సందర్భంగా గ్రామంలో పాలకవర్గము ఆధ్వర్యంలో అన్ని రకాల ఏర్పాట్లు చేయడంతో మహిళలు గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మెడబోయిన రాజు,గ్రామ వార్డు సభ్యులుగిరబోయిన రవీందర్,శ్రీమూర్తి శ్రీనివాస్ ,పెసరు ప్రమీల శ్రీనివాస్,పెసరు రాధాకృష్ణ, మంతెన ప్రియాంక మహేందర్,కావాటి మంజుల అనిల్,విరాళాలు అందించిన దాతలు, ప్రజలందరికీ పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

దుర్గామాతను దర్శించుకున్న టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు



ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 18 (మనం న్యూస్): : ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం మండల కేంద్రంలో దుర్గ సేవా సమితి, మున్నూరుకాపు దుర్గ దేవి కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నవరాత్రి పూజా కార్యక్రమాలకు టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండపాలలో కొలువుదీరిన జగన్మాతలను ఆయన దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. అంతకుముందు ఉత్సవ కమిటీ నిర్వాహకులు సుజిత్ రావుకు ఘన స్వాగతం పలికి, తీర్థప్రసాదాలను అందజేశారు.ఈ పూజా కార్యక్రమంలో మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉప అధ్యక్షుడు బైండ్ల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శులు ఖుతుబుద్దిన్ పాషా, ఏలేటి వినోద్ రెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉప అధ్యక్షుడు కోడిమ్యాల దీపక్ రాజ్, మండల కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు గూడసోల్లు ముత్యం రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లూరి సాగర్ పాల్గొన్నారు. అలాగే తిమ్మాపూర్ మాజీ ఉప సర్పంచ్ సల్ల సునీల్, కోడిమ్యాల నిఖిల్, పిట్టల వెంకటేష్, కనుక దినేష్, నల్లపోతరాజు శ్రీకాంత్, దుర్గాదేవి ఉత్సవ కమిటీ సభ్యులు, అధ్యక్షులు ఉ మాజీ ఎంపీటీసీ గూడ రాజిరెడ్డి, ఉ పాధ్యక్షులు అలిశెట్టి రాజరెడ్డి, వాల్‌గోట్ నరేష్, గూడ రమేష్, నరేందర్, బుక్క ధనంజయ్, తిరుపతి, పటేల్ యూత్ కమిటీ సభ్యులు పడాల రాజేందర్, ఒద్దె ముత్యంరెడ్డి, జంగిలి నరేష్, నవీన్, పోతు మనోహర్, నరేష్‌లతో పాటు దుర్గా సేవా సమితి సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చిత్తాపూర్ ప్రీమియర్ లీగ్ సీజన్-2 ఫైనల్‌కు హాజరైన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రేణికుంట్ల ప్రవీణ్



నెన్నెల, అక్టోబర్ 18 (మనం న్యూస్): మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలం చిత్తాపూర్ గ్రామంలో నిర్వహించిన చిత్తాపూర్ ప్రీమియర్ లీగ్ (సీపీఎల్) సీజన్--2 క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు రేణికుంట్ల ప్రవీణ్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమి గెలుపునకు నాంది కావాలని అన్నారు. యువత క్రీడల్లో రాణిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మత్తు పదార్థాలు, గంజాయి వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడలను ప్రోత్సహిస్తూ చక్కటి టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్న చిత్తాపూర్ యువకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి క్రీడా కార్యక్రమాలను భవిష్యత్తులోనూ మరింత ఉత్సాహంగా కొనసాగించాలని కోరారు. చిత్తాపూర్ గ్రామంలోని క్రీడా మైదానాన్ని మరింత ఆధునికీకరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిత్తాపూర్ సర్పంచ్ కమల మల్లేష్, నెన్నెల సర్పంచ్ ఇబ్రహీం, చిత్తాపూర్ ఉపసర్పంచ్ వెంకటేష్, నెన్నెల మాజీ సర్పంచ్ శ్రీను, డాక్టర్ తిరుమలేష్, సీపీఎల్ నిర్వాహకులు మహేందర్, రమేష్, మల్లేష్‌తో పాటు క్రీడాకారులు, అభిమానులు పాల్గొన్నారు

పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యవర్గంలో కోటపల్లి ఉపాధ్యాయులకు చోటు



కోటపల్లి అక్టోబర్ 18 (మనం న్యూస్): పీఆర్‌టీయూ టీఎస్ 2026--28 రాష్ట్ర కార్యవర్గంలో కోటపల్లి మండలానికి చెందిన ఆరుగురు ఉపాధ్యాయులకు వివిధ పదవులు లభించాయి. రాష్ట్రస్థాయి కార్యవర్గంలో మండల ఉ పాధ్యాయులకు ప్రాతినిధ్యం కల్పించడంతో ఉపాధ్యాయ వర్గాల్లో హర్షం వ్యక్తమైంది. బిల్లా తిరుపతయ్య (ఎస్ఏ, జెడ్పీహెచ్ఎస్ కోటపల్లి), నరహరి అంజన్ కుమార్ (పీహెచ్ఎం, ఎంపీపీఎస్ అన్నారం), ముత్యం రామ్ నారాయణ (ఎస్‌జీటీ, ఎంపీపీఎస్ కొల్లూరు) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. బాకం నగేష్ (ఎస్ఏ, జెడ్పీహెచ్ఎస్ మల్లంపేట), పబ్బతి వార్ మానాజీ (ఎస్ఏ, జెడ్పీహెచ్ఎస్ అన్నారం) రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, నూగూరి అర్చన (ఎస్ఏ, జెడ్పీహెచ్ఎస్ దేవులవాడ) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి, పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకరి బిక్షం గౌడ్, ప్రధాన కార్యదర్శి భట్టాపురం మధుసూదన్ రెడ్డి, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు కొట్టె శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బచ్చా మోహన్ రావులకు నూతన కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, హక్కుల పరిరక్షణకు, విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. రాష్ట్ర కార్యవర్గంలో కోటపల్లి మండలానికి ప్రాతినిధ్యం లభించడంపై పలువురు ఉపాధ్యాయులు నూతన ప్రతినిధులకు అభినందనలు తెలిపారు.

గ్రామ సేవకులకు ఘన సన్మానం



జైపూర్, అక్టోబర్ 18 (మనం న్యూస్): జైపూర్ మండలం షట్‌పల్లి గ్రామంలో దసరా పండుగను పురస్కరించుకుని గ్రామ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న పంచాయతీ కార్మికులను ఆదివారం సర్పంచ్ జాగటి సరస్వతి గోపాల్ ఘనంగా సత్కరించారు. గ్రామంలో తాగునీటి సరఫరా, డ్రైనేజీ పరిశుభ్రత, విద్యుత్ పునరుద్ధరణ సహా అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్న కార్మికులకు దసరా కానుకగా నూతన వస్త్రాలను అందజేసి, పండుగ అవసరాల కోసం ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ ప్రగతిలో, పరిశుభ్రతలో పారిశుధ్య, విద్యుత్ కార్మికుల పాత్ర అత్యంత కీలకమని, వారి నిరంతర సేవలను గుర్తించి ప్రోత్సహించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్మికుల సేవలను గుర్తించి సన్మానించడంపై గ్రామస్థులు, పంచాయతీ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

దుర్గాదేవిని దర్శించుకున్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి




రాయికల్, అక్టోబర్ 18 (మనం న్యూస్) : రాయికల్ మండలంలోని అల్లీపూర్, కుమ్మరిపల్లి గ్రామాలతో పాటు రాయికల్ పట్టణంలో నిర్వహించిన దుర్గాదేవి అమ్మవారి ఉత్సవాల్లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్ బాబును కలిసిన మంథని డిపో మేనేజర్

మంథని,అక్టోబర్18 (మనం న్యూస్)రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మంథని ఆర్టీసీ డిపో నూతన మేనేజర్ జ్ఞానేశ్వర్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు.మంథని డిపో ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి గంధం రమేష్ ఆధ్వర్యంలో ఈ కలయిక జరిగింది. రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబుతో డిపో మేనేజర్ జ్ఞానేశ్వర్ డిపోకు సంబంధించిన పలు అంశాలను వివరించారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు, నాయకులు,అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



దుర్గామాత సేవలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మేడిపల్లి అక్టోబర్ 18 (మనం న్యూస్): మేడిపల్లి మండల కేంద్రంతో పాటు పోరుమళ్ల, కట్లకుంట గ్రామాల్లో కొలువుదీరిన శ్రీ దుర్గాదేవి అమ్మవారిని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన అమ్మవారి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆది శ్రీనివాస్ అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. అలాగే దసరా పండుగను ఎలాంటి అవాంతరాలు లేకుండా ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరారు. అదేవిధంగా గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండలంలోని నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ప్రణవ్



జమ్మికుంట, అక్టోబర్ 18 (మనం న్యూస్): తొమ్మిది రోజులపాటు తీరొక్క పూలతో దైవంగా పూజించి, ప్రకృతి ఒడిలోకి అదే పూలను చేర్చి, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టిన పండుగ బతుకమ్మ అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.. సద్దుల బతుకమ్మ సందర్భంగా జమ్మికుంట పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానం, నాయిని చెరువు కట్ట మీద జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... బ్రతుకునుచ్చే బతుకమ్మ చల్లంగా రాష్ట్రాన్ని, హుజురాబాద్ నియోజకవర్గాన్ని దీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట కౌన్సిలర్లు, పట్టణ, మండల నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ బర్కం నర్సయ్యకు మాతృవియోగం



కోరుట్ల అక్టోబర్ 18 (మనం న్యూస్): కోరుట్ల మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బర్కం నర్సయ్య తల్లి బర్కం బోర్రవ్వ (85) ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. వయోభారంతోనే ఆమె మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బర్కం బోర్రవ్వ మరణవార్తతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు. మాజీ ఎంపీటీసీగా బర్కం నర్సయ్య 2005లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గుమ్లాపూర్, వెంకటాపూర్ గ్రామాలకు ప్రాతినిధ్యం వహిస్తూ ఎంపీటీసీగా సేవలందించారు. రెండు గ్రామాల ప్రజలతో ఆత్మీయ సంబంధాలు కొనసాగిస్తూ, అందరినీ కలుపుకొని ప్రజా సేవలో పనిచేశారు. బర్కం బోర్రవ్వ మృతి పట్ల గ్రామస్తులు, పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

సుందరగిరి గ్రామాభివృద్ధి, బతుకమ్మ తల్లి విగ్రహ ఏర్పాటుపై సర్పంచ్ జంగా శిరీష రమణారెడ్డితో ముఖాముఖి



చిగురుమామిడి ,అక్టోబర్ 18(మనం న్యూస్) : సుందరగిరి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఊర చెరువు వద్ద బతుకమ్మ తల్లి విగ్రహ ఏర్పాటుపై సర్పంచ్ జంగా శిరీష రమణారెడ్డిని, ఆదివారం మనం విలేకరి ప్రశ్నించగా ఆమె ఇలా సమాధానం ఇచ్చారు.

విలేకరి: బతుకమ్మ తల్లి విగ్రహ ఏర్పాటు ఎందుకు చేస్తున్నారు?

సర్పంచ్: మా సుందరగిరి గ్రామ ఆడపడుచుల కోసం. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను మా ఊర చెరువు వద్ద ఘనంగా జరుపుకోవాలని గ్రామ యువకుల ప్రోత్సాహంతో, పంచాయతీ సహకారంతో బతుకమ్మ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నాము.

విలేకరి: అక్కడ ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?

సర్పంచ్: విగ్రహం పెట్టే స్థలాన్ని బ్లేడ్ ట్రాక్టర్ తో చదును చేయించాము. ఆడపడుచులు తీరొక్క పూలతో బతుకమ్మ ఆడుకునే మైదానాన్ని శుభ్రం చేయించాము. మహిళలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఐమాక్స్ లైట్లు, డీజే సౌండ్స్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయిస్తున్నాము.

విలేకరి: సుందరగిరి గ్రామంలో ఎలాంటి ఆలయాలు ఉన్నాయి?

సర్పంచ్: మా గ్రామంలో భక్తి భావం ఎక్కువ. గ్రామంలో ప్రధానంగా, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, శివాలయం, రేణుకా దేవి, పెద్దమ్మతల్లి ఆలయాలు ఉన్నాయి. దసరా, ఉగాది, స్వామివారి బ్రహ్మోత్సవాలు, శ్రీరామ కళ్యాణం, వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వార దర్శనం, గోదాదేవి కల్యాణ మహోత్సవము, హనుమాన్ జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తాము.

విలేకరి: గ్రామ అభివృద్ధి కోసం ఇంకా ఏం చేయాలనుకుంటున్నారు?

సర్పంచ్: గ్రామ అభివృద్ధే మా లక్ష్యం. ఇప్పటికే అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టాము. ఇంకా ఆలయాల అభివృద్ధి, చెరువు కట్ట మరమ్మతులు, పార్క్ ఏర్పాటు చేయాలని ప్రణాళికలు ఉన్నాయి.

విలేకరి: మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారం ఎలా ఉంది?

సర్పంచ్: మా గ్రామానికి మంత్రి ఎంతో సహకారం అందిస్తున్నారు. ఆయన 2వ వార్డు నుండి ఊర చెరువులోని బతుకమ్మ ఘాట్ వరకు సీసీ రోడ్డుకు నిధులు మంజూరు చేసి రోడ్డు వేయించారు. గతంలో బురదలో ఇబ్బంది పడేవారు, ఇప్పుడు రోడ్డు వల్ల సులభంగా వెళ్లవచ్చు.

విలేకరి: చివరిగా ఏం చెబుతారు?



సర్పంచ్: సీసీ రోడ్డు ఏర్పాటు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ గారికి 2వ వార్డు ప్రజలు, గ్రామ ప్రజలు, మహిళలందరి తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నాము. తీరొక్క పూలతో బతుకమ్మ ఆడటానికి వచ్చే ఆడపడుచులందరికీ స్వాగతం పలుకుతున్నాము.

సర్పంచ్ జంగా శిరీష రమణారెడ్డి వ్యక్తిగత వివరాలు:

విద్యార్హత: ఎం.ఎస్సీ పూర్తి

భర్త: జంగా వెంకటరమణారెడ్డి, సుందరగిరి, (మాజీ సింగిల్ విండో చైర్మన్, చిగురుమామిడి)

పిల్లలు: ఒక బాబు – అర్జున్ రెడ్డి, ఒక పాప – అక్షర ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఘనంగా జన్మదిన వేడుకలు



భీమారం అక్టోబర్ 18(మనం న్యూస్)మండల కేంద్రంలో, ఆదివారం మాజీ పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు,చెన్నూర్ నియోజకవర్గం శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బాల్క.సుమన్ 43 వ పుట్టినరోజు వేడుకలు బి ఆర్ ఎస్ శ్రేణులు ఘనంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఉద్యమ పటిమను గుర్తు చేసుకుంటూ తెలంగాణ ఏర్పాటు కొరకై కెసిఆర్ పిలుపు మేరకు,ఉద్యమంలో, చురుకైనా పాత్ర పోషించి, తను 30వ యేటనే పెద్దపెల్లి ఎంపీగా పోటీ చేసి గెలుపొంది తనదైనా ముద్ర వేసుకొని గుర్తింపు తెచ్చుకున్నారు. అలాగే 2018లో చెన్నూరు ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచి అనతి కాలంలోనే ప్రభుత్వ వీప్ బాధ్యతలు చేపట్టి,చెన్నూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో,అంచేలాంచెలుగా ముందుకు తీసుకెళ్లారు. వెనుకబడి ఉన్న ఈ ప్రాంతాన్ని అత్యంత శరవేగంగా కేవలం 5సంవత్సరాల కాలంలోనే,ప్రత్యేక బాటలు వేసి నియోజకవర్గం ప్రజల మన్ననలను పొందారు. ప్రత్యేకంగా భీమరశీ నూతన మండలంగా ఏర్పాటు దిశలో ముఖ్యపాత్ర వహించి, నూతన మండలంని ఏర్పాటు చేసి భీమారం ప్రాంత ప్రజల చిరకాల కల నెరవేర్చారు. ఈ కార్యక్రమంలో, బి అర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్స్,తదితరులు పాల్గొన్నారు.